

# కింకర్తవ్యం?

## పి.వి.ఆర్. శివకుమార్.

““ఏమయిందండి ?”

అడుగుదామనుకుంది సరస్వతమ్మ.

ఆడగలేదు, అడగలేకపోయింది.

జవాబు తెలియని ప్రశ్నలు అడిగి నంత సులభంగా, జవాబు తెలియని సమస్యను కదిలించటం వీలుకాదు.

ఆ ప్రశ్న తను బయటకు వేస్తే. భర్త ఏం జవాబు చెబుతాడో తెలుసును.

ప్రేలనున్న అగ్నిపర్వతంలా కనుపించాడు భర్త ఆమెకు.

సీతారామయ్య ముఖం సరిగ్గా అలాగే వుంది.

ఆవిర్లు కక్కుతూ కూర్చునివున్నాడు ఆ పడకకుర్చీలో అతను.

అన్ని ప్రయత్నాలూ అలాగే వీగి పోయాయి,

ఇహ ఓటమి తప్పదు. మళ్లీ నిరాశ తప్పదు.

అయితే, ఎప్పటికైనా ఓటమిని జయించగలడా ? ఏనాటికైనా నిరాశని తరిమెయ్యగలడా ?

ఆ ఆశలేదు.

అందుకే అతడు మండిపడు తున్నాడు.

ఎవరిమీద మంట ?

తనమీదే। తన నిస్సహాయత మీద. తన అధమసాయి మధ్య తరగతి బ్రతుకు మీద. తను కూడబెట్టుకోలేక పోయిన డబ్బుమీద. తను యీదవల్సి వున్న మహా సాగరం మీద।

ఇది మొదటిసారి కాదు. ఎన్నో సార్లో సరస్వతమ్మకూడా గుర్తు లేదు।

ప్రతిసారీ యిదే పరిస్థితి। ఏనాటికీ మారదేమోనని భయపడుతున్న పరిస్థితి।

ఏం చెయ్యాలి ? కిం కర్తవ్యమ్ ?

మౌనంగా గడపలో కూలబడింది.

ఆమె చేతిలోని తాటాకు విసనకర్ర అప్రయత్నంగా వూగులాడింది.

బలహీనంగా వీచిన గాలి, సీతారా మయ్యలోని నివురు విసురుగా తొలగించింది.

"ఇహ నావల్ల కాదు."

ఒక్కసారి అన్నాడు సీతారామయ్య.

తుళ్లిపడింది మధ్యగది కిటికీదగ్గర సుషమ.

ఆమెకూ ఆ జవాబు తెల్సు. తెల్సినా ఉలికిపాటు తప్పలేదు. బరువుగా వాలిపోయింది, లోపల మంచంమీద.

"చేతనయినన్ని విధాలా ప్రయత్నించాను." మళ్లీ అన్నాడు సీతా రామయ్య.

మౌనంగా అతడికేసే చూస్తోంది సరస్వతమ్మ.

"ఇహ యీ ఒక్క కొంపగూడా పూర్తిగా అమ్ముకోక తప్పేలాగా లేదు ?"

అరిచాడు సీతారామయ్య.

నోరు మెదిపిందావిడ.

"ఎక్కడా అప్పు పుట్టలేదా ?"

"ఎవడిస్తాడు ? ఏం చూసి యిస్తాడు? అదే అడుగుతున్నాడు ప్రతివాడూను।"

అయినా వున్నవన్నీ చాలక క్లా మొదలుపెట్టనా ? రెండు, మూడు వేలన్నా కావాలి యింకా।

మూషి పాతికవేలు చెయ్యని కొంప మీద, పదిహేను వేలదాకా యిచ్చాడు ఆ శరభయ్య యిప్పటికే।

ఇవాళ అంటాడూ,

'నీ కొడుకు పంపేది కాస్తా ప్రతి

నెలా వడ్డీకే చాలటంలేదు. యీ అప్పు యినా ఎలా తీరుస్తావోనని చూస్తూ, యింకా ఎలా యిమ్మంటావయ్యా? పోనీ, నాకు వదిలిపారెయ్యి ఆ కొంప! మరో అయిదువేలు యిచ్చి బాకీ చెల్లు వేసేస్తాను!' అని!

చెయ్యటం తేలికే ఆ పని.

దాంతో సుషమని బయటికి పంపెయ్యటం పూర్తవుతుంది గానీ, బాబిగాడి చదువూ, నానిగాడి, చంటాడి బతుకులూ ఎలా తెల్లవారతాయి?

రేపొద్దుటినుంచీ మరో అద్దె కొంపలో, అద్దెగూడా కట్టను ఎలా వీలు?

"ఏదీ, యిలా రమ్మను సుషమని"

"ఎక్కడ ఏడుస్తోందది?"

"మధ్యను అదేంజేస్తుందండీ?" నెమ్మదిగానే అంది సరస్వతమ్మ. "ఏంచెయ్యను చేతకాదుగానీ, చెప్పిన మాట వినకుండా రంకె లెయ్యటం మటుకు చేతనౌనేం?

నన్ను కాల్చుకు తినటానికే పుట్టారు వీళ్లంతా – కడతేర్చడానిక్కాదు, శత్రువులు – పోయిన జన్మలో శత్రువులు!"

నిప్పులు కక్కాడు సీతారామయ్య.

"నాలుగేళ్లనాడే చెప్పాను, అక్కయ్యలతో పడిన నరకం చాలు తల్లీ – నువ్వయినా నోరు మూసుకు నే తెచ్చినవాణ్ణి కట్టుకోమని!"

ఆ పని చేసిందా? లేదు.

ఎందుకు చేస్తుంది! నన్ను పూర్తిగా బుర్ర గొరిగించి వీధిలో నిలబెట్టనిదే?

చదువులు కావల్సి వొచ్చాయి. డిగ్రీ చదువులు!

ఏం అఘోరిస్తుందిప్పుడా డిగ్రీ. నెత్తిన పెట్టుకుని ఊరేగమను. తలో దమ్మిడీ భిచ్చమయినా వెయ్యరెవరూ!

అప్పుడే అయితే, ఏ మెట్రిక్యులేటో, ఏ గుమాస్తా పని చేస్తున్నా – నాలుగైదు వేలల్లో సరిపడేవాడు!

ఇవేళ అమ్మాయిగారు బి. యే! యీవిడగారికి ఎమ్మేలో, ఎమ్మెస్సీలో కావాలి!

వాళ్లు చూస్తే కోతుల్లా కొమ్మమీంచి దిగిరారు – దేవుళ్లలా కొండమీంచి కదలరు!

ఆ చెట్లు, కొండలు ఎక్కను నాకేదీ సామర్థ్యం? ఇద్దరమ్మాయిల్ని కొండ లెక్కించేసరికే కాళ్లు విరిగి చతికిల బడ్డ వెధవను!

దానికి తగ్గట్టుగానే దాని తమ్ముళ్లూను!

బాబిగాడిప్పుడా విశాఖలో ఇంజనీరింగు వెలిగించకపోతేనేం? ఆ బి. యస్సీతోనే ఏ గుమాస్తాగిరో దొరక్కపోనా? రేపా బోడి ఇంజనీరింగు డిగ్రీతో మాత్రం మహా ఊడ బొడిచెయ్యబోతాడా?

నానిగాడిని మాట్లాడమను; కీళ్లు విరగ



బోడుస్తా! ఆ ఇంటరేదో కాగానే నౌకరీలో చేరకపోయాడో చెప్తా!...

ఎన్ని సంబంధాలు! ఎన్ని సంబంధాలు!

కట్నాలదాకా రావటం - కటుక్కున తిరిగిపోవటం!

ఇదీ వట్టిదై పోయిందా?

ఇహ నావల్ల కాదు.

పెళ్లీ లేదు - పెటాకులూ లేదు. కబుర్లు చెప్పిందిగా - నా కడుపు నే పోసుకో గలనని! ఏడవమను - లేదా, మూల పడుండమను.

ఈ ముదనష్టపు వెదుకులాట కిక నే చావలేను!

"సీతారామయ్యగారూ ... సీతా రామయ్యగారూ..."

ఎవరో పిల్చారు వాకిట్లోంచి

"ఎవరదీ! వస్తున్నా... ఎవరు దాపురించారో నా ప్రాణానికి! ఎవరో అప్పులాడు కాదు గదా ఖర్మ..." గొణుగుతూ విసురుగా లేచి బయటికి నడిచాడాయన.

దిగాలుగా అటే చూస్తూ, కన్నీళ్లైనా తుడుచుకునే ఓపికలేనట్లు గుమ్మం వారకి జారగిలబడిపోయింది సరస్వతమ్మ. ఆమె చేతిలో విసనకర్ర ఎప్పుడో జారిపోయింది.

తడిసిన తలగడకే ముఖాన్ని రుద్దుకుంటూ పడుకునే వుండిపోయింది తండ్రి సవాలుకి జవాబు తన దగ్గరలేని సుషమ.

* * *

"ఆగు..."

ఉలికి పడింది సుషమ.

వెనుకగా వడివడిగా వస్తూ ప్రకాశం!

ఒక్కసారిగా అంత ఉద్రేకమూ తగ్గిపోయి, - కాళ్లూ - చేతులూ చచ్చుబడినట్లయి నూతి గట్టుమీదే కూలబడిపోయింది సుషమ.

"ఎందుకు నన్నాపారు!" రుద్ధంగా అంది.

"ఆపక? అలాగే చూస్తూ ఊరుకోమన్నావా?"

పిచ్చిదానా! సాయంత్రంనుంచీ మీ యింట్లో జరుగుతున్న శోకం వింటూనే వున్నా!

నాకు—తెల్సు నీ అత్మాభిమానం చివరికి నీకే కర్తవ్యం బోధిస్తుందో!

"ఛీ... చివరికి నీకూ ఇదే మార్గం తోచిందన్నమాట! ఇలాగైతే యిహ నీకూ – నీకన్న పాతికేళ్ల ముందు పుట్టిన ప్రాచ్యులకి ఏమిటి వైవిధ్యం?"

"చదువుకోని మందభాగ్యులకీ, చదువుకుని స్వయం వ్యక్తిత్వాన్నీ, సంస్కారాన్నీ సాధించానని భ్రమిస్తున్న నీకూ ఏమిటి తేడా?..."

"గొప్ప అభిమానవతివే!"

"చేతనైతే మీవాన్న బాధని తొలిగించాలి గానీ-ఆ మార్గం యిది కాదు."

నడు చెప్తా - ఆ మార్గం ఏదో!"

చెయ్యిపట్టి లేవదీస్తూ అన్నాడు ప్రకాశం.

"వొదలండి. నాకే మార్గమూ వొద్దు. నాకిహ బ్రతుకే వొద్దు. కన్నవాళ్లకే బరువైపోయిన బ్రతుకు..."

"ఎవరి బ్రతుకు వారికి తప్ప, మిగతా వారందరికీ – ఒక పరిధి దాటాక – బరువే! అది కన్నవారైనా, మరెవరైనా తప్పదు.

ఇప్పుడింకా నీ బ్రతుకు బరువు వాళ్లే మోయాలనుకోవటానికి నీ వ్యక్తిత్వం అడ్డుచెప్పటం లేదూ?

యుక్తవయసు దాటి, విద్యావతి

నైన నీ బ్రతుక్కి మార్గం నువ్వే చూసుకోవటం ఉత్తమం — నీ ధర్మం!

"రా...నేను చెప్తాను, మీ నాన్న గారికెలా ఋణవిముక్తి కలిగించారో!"

విస్మయంగా అతడికేసి చూసింది సుషమ.

"సుషమా! అలా ఆశ్చర్యపడకు."

గత మూడేళ్ళుగా అవిరళంగా ఆలోచిస్తున్నా, మీ నాన్నగారి చండ శాసనమూ, నీ గంభీరర్యమూ నన్ను సాహసించనివ్వలేదు.

"ఎప్పుడైతే చచ్చిపోవటానికైనా నువ్వు సిద్ధపడ్డావో, అప్పుడే మీ నాన్నగారి మొండితనమూ, నీ గాంభీ ర్యమూ నాకు అడ్డు తొలిగిపోయాయి."

"పోనీ, యిది నీ నూతన జన్మ అనుకో!"

ఈ క్రొత్త బతుకులో నీకింకా ఆ పాత కులం లేదు! బుద్ధెరిగినప్ప ట్నుంచే కులాన్ని మర్చిపోయాను నేను.

"కనుకనే సాహసించ గలుగు తున్నాను."

'దయచేసి నామాట విను. నడు...'

సుషమ తలవంచుకు విన్నది. వింటోంది...

* * *

ఉదయంనించీ నూతులూ, చెరు వులూ వెదికి, వెదికి వేసారి కన్నీళు గూడా కరువైపోగా, నెత్తులమీద చేతులు పెట్టుకు కూర్చున్న సీతా రామయ్యగారూ, సరస్వతమ్మా, బయట స్కూటర్ చప్పుడు కావటంతో ఒక్క ఉదుటున లేచి బయటకు వచ్చారు — 'ప్రకాశం వచ్చినట్లున్నాడు అతడితో చెప్తే, అతడయినా వెదకటంలో కొంత తోడ్పడతాడేమో' ననుకుంటూ.

పసుపు, బట్టంతో, పారాణి పాదా లతో వెనుకగా స్నేహితులు రిక్షాలు దిగుతుండగా పచ్చగా దర్శన మిచ్చారు ప్రకాశం — వెనకే సుషమా!

కోపమో, ఆవేశమో, బాధో, లోకుల భయమో... లేక కలగాపుల గంగా అన్నీనో కలిసి నిర్బంధితుల్ని చేసి నిలబెట్టేశాయి యిద్దర్నీ కనబడ్డ ఆ దృశ్యంతో!

ఇహ తను యింటిని ఎవరికీ అమ్మ నక్కర్లేదని, అందరిదగ్గరా అప్పుచేసి ఆమె పెళ్ళికోసమే బ్యాంకులో వుంచిన ఏడు వేలూ కూడా తిరిగి ఆ అప్పులు తీర్చటానికే వినియోగపర్చవచ్చుననీ. గొడ్డలికోసం తనని వెతికిస్తున్న సమస్య శాస్త్రా గోటితోనే తీరిపోయిందనీ యింకా తట్టలేదుగానీ, తట్టగానే బహుశః సీతారామయ్యగారూ సుముఖం గానే నిట్టూరుస్తారేమో! నిట్టూర్చలేక పోతే...ఆయన ఖర్మ మరి!